క్లుప్తంగా

రూ.1.08 లక్షలు పట్టివేత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.1.08 నగదును స్వాధీనం చేసుకున్నట్లు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో భాగంగా కర్నాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్నాటక నుంచి రాష్ట్రంలోకి వస్తున్న కారులో తనిఖీ చేయగా నగదును గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

మండల పరిధిలోని హుస్సెల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతీలాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. రోజుకు ఎన్ని వాహనాలు వెళ్తున్నాయి.. వాహనాలను క్షుణంగా తనిఖీ చేస్తున్నారా? లేదా? అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

యువకుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: నమాజ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన మహమ్మద్ హుస్సేన్ బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటికి సమీపంలో ఉన్న మజీద్ దగ్గరకు నమాజ్‌కు వెళ్తున్నానని చెప్పి రాకపోవడంతో దీంతో కుటుంబ సభ్యులు హుస్సేన్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో హుస్సేన్ అదృశ్యంపై సోదరుడు మక్బూల్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు కోరారు. గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి నివాసంలో నీలం మధు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పటాన్‌చెరు టౌన్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ధీమా వ్యక్తం చేశారు. పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం పట్టణానికి చెందిన మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు అవినాష్‌గౌడ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అవినాష్‌గౌడ్ మాట్లాడుతూ నీలం మధు గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



కోలాటం ఆడుతున్న మహిళలు

సదాశివపేట(సంగారెడ్డి): శ్రీరామనవమిని పురస్కరించుకొని సదాశివపేట పట్టణంలో శ్రీ రామకళా మందిరం నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా శ్రీరాముడి విగ్రహంతో గురువారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కోలాటాలు ఆడుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు.

చెట్లే టెంట్లు

జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా పని చేసే కూలీలకు ఇబ్బందులు తప్పడంలేదు. పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బాధలు తప్పడం లేదని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికే ఎండ తీవ్రత పెరగడంతో పనులు చేసేందుకు కూలీలు జంకుతున్నారు. గతంలో పని ప్రదేశాల్లో గుడారాలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచేవారు. పనిలేని సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు నీడ కోసం గ్రీన్‌షెడ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో మండుటెండల్లోనే పని చేయాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– మునిపల్లి(అందోల్)



ఎండ తీవ్రత తట్టుకోలేక చెట్ల నీడన సేద తీరుతున్న కూలీలు

- మండుటెండల్లో ఉపాధిహామీ కూలీలు
- పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువు
- రోజు కూలి రూ.500 ఇవ్వాలని కూలీల విజ్ఞప్తి
- ఆరేళ్లుగా అందని పనిముట్లు

జిల్లాలో గ్రామ పంచాయతీలు 647
జాబ్ కార్డులు 2.2 లక్షలు
కూలీల సంఖ్య 4.06 లక్షలు
ప్రభుత్వం అందిస్తున్న దినసరి కూలి రూ.300
పని గంటల సమయం: ఉదయం 6–10
నుంచి లేదా 8 నుంచి 11 గంటల వరకు..

ఎండ తీవ్రతతో కూలీల ఆందోళన

ఉపాధిహామీ కూలీలకు ఆరేళ్లుగా గడ్డపార, తట్టలు తదితర సామాగ్రి అందడం లేదు. కూలీలే సొంతంగా వాటిని సమకుర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కూలీలు తాగునీటిని వెంట తీసుకెళ్తున్నారు. పని చేసే సమయంలో ఎండ తీవ్రత తట్టుకోలేక సమీపంలో ఎక్కడ చెట్లు కనిపించినా కూలీలు వాటి నీడకు వెళ్లి సేద తీరుతున్నారు.

రూ.500 కూలి ఇవ్వాలి



ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.300 దినసరి కూలి గిట్టుబాటు కావడం లేదు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో కూలీ డబ్బులు సరిపోవడం లేదు. దీంతో ప్రతి కూలీకి రోజుకు రూ.500 చొప్పున కూలి ఇవ్వాలని కోరుతున్నాం.

– కుమ్మరి శ్రీశైలం, తాటిపల్లి గ్రామం

అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కూలీలకు రోజుకు రూ.300 చొప్పున కూలి ఇస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను ఈ నెల 15వ తేదీన ప్రభుత్వం మంజూరు చేసింది. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఉదయం 6–10 వరకు లేదా 8–11 గంటల వరకు పనులు చేయాలని చెప్పాం. కూలీల విజ్ఞప్తి మేరకు పనులు కొనసాగుతున్నాయి. పనిచేసే ప్రదేశంలో కూలీలకు వైద్యం అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

– జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ

‘ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది’

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొల్కూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన దొంత విజయ్‌కుమార్ పదవీ విరమణ సభకు శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్ర మైందన్నారు. విద్యారంగంలో విద్యాభివృద్ధికి విజయ్‌కుమార్ చేసిన సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ఎంఈఓ అంజయ్య, ఎంపీటీసీ ప్రమీల, ప్రధానోపాధ్యాయుడు విద్యాకర్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, మదన్‌గోపాల్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సంఘం నాయకులు శ్రవణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, తుకారాం, సురేందర్, సంగాగౌడ్, ప్రభు, దయానంద్, దేవీసింగ్, మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

జోగిపేట(అందోల్): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. జోగిపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆశయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా అందోలు పీఆర్‌టీయూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ఆశయ్య అందించిన సేవలు మరచిపోలేనివని కొనియాడారు. అనంతరం ఆశయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, పంచాయతీరాజ్ ఉపాధ్యాయ పత్రికా సంపాదకవర్గ సభ్యులు మాణయ్య, సంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభు, జెడ్పీటీసీ అపర్ణ, అందోలు జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్ శివశంకర్, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు నరోత్తం, రాజమల్లు, ఎంఈఓ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



ఆశయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని చీక్ మద్దూర్ గ్రామంలో జాతీయ సేవా పథకంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల కందిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 45మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మినిస్టిరీ ఆఫ్ యూత్ ఆఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ సాగు పద్ధతులు, ఆరోగ్య సమస్యలు, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిబిరం ఏడు రోజుల పాటు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్లు సత్యనారాయణ, సయ్యద్ హుస్సేన్, మోటివేషన్ స్పీకర్ నరేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పద్మ, రాకేశ్ పాల్గొన్నారు.

వర్క్‌ఆర్డర్ పెంచాలని ఉద్యోగుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న బీఎంఎస్ నాయకులు

కంది(సంగారెడ్డి): వర్క్ ఆడర్ పెంచడంతో పాటు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఎంఎస్ అధ్యక్షుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధ కార్మాగారం (ఓడీయఫ్)లో బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడీయఫ్‌లో విలువైన యంత్రాలను బ్రేక్ డౌన్ చేస్తూ వర్క్ ఆడర్‌ను ప్రైవేట్ పరిశ్రమలకు ఇస్తున్నారని మండిపడ్డారు. మహిళా ఉద్యోగుల కోసం నిర్మించిన సంరక్షణ భవనాన్ని ప్రారంభించాలన్నారు. వర్క్‌ఆడర్‌ను పెంచేందుకు యంత్రాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి బాల నర్సయ్య, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్, ఈసీ ఈ మెంబర్లు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రదీప్, పవన్, ప్రభు, అనిల్, కేకే గౌడ్ పాల్గొన్నారు.

రక్తదానంతో యువకుడి ఔదార్యం



రక్తదానం చేస్తున్న సంతోష్‌రావు పాటిల్

నారాయణఖేడ్: ఓ వ్యక్తి గుండె శస్త్ర చికిత్స కోసం అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో నారాయణఖేడ్ బ్లడ్‌డోనర్స్ గ్రూపు సభ్యుడు తన రక్తాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి గుండె శస్త్రచికిత్స నిర్వహించాలని వైద్యులు నిర్దేశించారు. అందుకుగాను అత్యవసరంగా ఏబీ పాజిటివ్ గ్రుపు రక్తం అవసరమని తెలిపారు. ఆ గ్రుపు రక్తం ఉన్న వారు అరుదుగా ఉంటారు. రక్తం అందుబాటులో లేకపోవడంతో ఖేడ్ బ్లడ్‌డోనర్స్ గ్రూపు సహకారాన్ని రోగి కుటుంబీకులు అర్థించారు. స్పందించిన అదే గ్రుపు రక్తం కలిగిన సభ్యుడు సంతోష్‌రావు పాటిల్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి రక్తాన్ని దానం చేసి ఔదార్యం చాటుకున్నాడు. సంతోష్‌రావు పాటిల్ రక్తాన్ని దానం చేయడం 28వ పర్యాయం కావడం విశేషం.

12మందిపై కేసు నమోదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 12మందిపై శుక్రవారం పోలీసులు కేసులే నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... రామచంద్రాపురం ట్రాఫిక్ ఎస్ఐ ప్రదీప్ లింగంపల్లి చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది బెల్ టౌన్‌షిప్‌లో నుంచి లింగంపల్లి బస్‌స్టాండ్ వైపు రాంగ్‌రూట్‌లో వాహనాలపై అతివేగంగా వెళ్తుండగా 12 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కౌన్సిలింగ్ నిమిత్తం మాదాపూర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

రాయికోడ్(అందోల్): మండలంలోని శంశోద్దీన్‌పూర్ గ్రామశివారులో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ షరీఫ్, ఏపీఓ రమేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని కోరిన ప్రతి కూలీకి పని కల్పిస్తామన్నారు. జాబ్‌కార్డులు ఉండి పనికిరాని వారికి పనులకు రప్పించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.



కూలీల హాజరు వివరాలను తెలుసుకుంటున్న అధికారులు

చింతల్‌ఘాట్‌లో మల్లికార్జునస్వామి ఉత్సవాలు

కోహీర్(జహీరాబాద్): మండలంలోని చింతల్ ఘాట్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. అంతకుముందు పోతురాజుల విన్యాసాల మధ్యన బోనాలను ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తెలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించండి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

పటాన్‌చెరు: కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మొద్దని, కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి విశేష అనుభవం కలిగిన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్‌లోని గొల్లబస్తీలో వెంకట్రామిరెడ్డితో కలిసి శుక్రవారం పర్యటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు సపాన్‌దేవ్, శంకర్‌యాదవ్, ప్రతాప్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి తన సొంతంగా ట్రస్టు ఏర్పాటు చేసి యువతకు కోచింగ్ కేంద్రాలు, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి జాబ్‌మేళా ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీనివ్వడం హర్షనీయమన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల హామీలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తనకు మాయమాటలు రావని, మాట తప్పే వాణ్ణి కాదన్నారు. ప్రజా సేవ కోసం వస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చరిత్ర అధారంగా తెల్లాపూర్‌కు తెలంగాణపురంగా పేరు మార్చాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్‌లో పూర్వకాలం నాటి శాసనం ఉందని, ప్రస్తుత తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పిలిచేవారని శాసనంలో రాయబడిందన్నారు. శాసనంలో రాసినవిధంగా తెల్లాపూర్‌కు తెలంగాణపురంగా పేరు పెట్టాలని తెలిపారు. తెల్లాపూర్ గ్రామంలో ఉన్న శిలాశాసనాన్ని తెల్లాపూర్‌లోని రేడియల్ రోడ్డు నెంబర్ 7 సర్కిల్‌లో ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ రింగ్ రోడ్డు వద్ద ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ వాహనాల పెండింగ్ చలాన్‌లను పరిశీలించారు. రామచంద్రాపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సురేష్‌షెట్కర్‌ను గెలిపించాలి

మునిపల్లి(అందోల్): జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కర్‌ను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్‌పటేల్ అన్నారు. మండల పరిధిలోని కంకోల్, మగ్దుంపల్లి గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా రసూల్ పటేల్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సైనికులుగా పనిచేయాలన్నారు. నాయకులు మహేశ్, నర్సింలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



సురేశ్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గోవిందరాజుపల్లి గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ గోవిందరాజుపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు శ్రీశైలంతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. నేడు నిర్వహించనున్న సీఎం సభకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు శనివారం నామినేషన్ వేయనున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సురేశ్‌షెట్కార్ సమక్షంలో..

నారాయణఖేడ్: మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ సమక్షంలో ఖేడ్ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సురేష్‌షెట్కార్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాహెర్‌అలీ, గౌస్ చిస్తి, మోయిన్ పాల్గొన్నారు. అదేవిధంగా సిర్గాపూర్ మండలంలోని చందర్‌నాయక్ తండా గ్రామ పంచాయతీ తాజా మాజీ వార్డుసభ్యులు లక్ష్మణ్‌నాయక్‌తో పాటు ఆయన అనుచరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

నీలం మధు నామినేషన్‌కు తరలిరండి

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నామినేషన్‌కు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను ఎంపీగా గెలిపించి సీఎంకు బహుమతిగా ఇస్తామన్నారు. ఈ నెల 20వ తేదీన మెదక్‌లో నామినేషన్ సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని ముదిరాజ్ భవన్ వద్ద నుంచి ర్యాలీతో బయలుదేరి నామినేషన్ వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాణిక్యం, డీసీసీ కార్యదర్శి సామయ్య, పీసీసీ మాజీ కార్యదర్శి మతిన్, రవి ముదిరాజ్, నరేష్, అమిత్, పాషా, ఆసిఫ్ పాల్గొన్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు దాఖలు

సంగారెడ్డి టౌన్: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి రెండో రోజైన శుక్రవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని కలెక్టర్ క్రాంతి తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటిరోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరపున సాగర ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. రెండో రోజైన శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని కలెక్టర్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులు మారుతిరావు, ఆనందీశ్వర్, ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా మహాదేవ్‌స్వామి 2 సెట్లు దాఖలు చేశారన్నారు. ఇప్పటివరకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని కలెక్టర్ పేర్కొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న మహాదేవ్‌స్వామి